E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు   జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387

PUBLISHED: HYDERABAD, JANGAON   సంపుటి :01   సంచిక :89   ఆదివారం   30 ఆగస్టు 2026   ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్   పేజీలు: 04   వెల :05/-

## మున్సిపల్ చట్టంలో కీలక మార్పులు!

డిప్యూటీ మేయర్లు ఇక ఒక్కరే!
వైస్ చైర్మన్ సంఖ్య కుదింపు
మున్సిపల్ పాలనలో కీలక మార్పులు
28 జెడ్పీల ఏర్పాటుకు ఓకే!
కొత్త జిల్లాలతో జెడ్పీల పునర్వ్యవస్థీకరణ
గెజిట్ విడుదలకు రంగం సిద్ధం
స్థానిక సంస్థల్లో భారీ మార్పులు!



2 లో

## సోనియా ఆత్మకథపై బీజేపీ ఫైర్

సోనియా పుస్తకంపై బీజేపీ అధ్యక్షుడి విమర్శలు
ఆత్మకథలో వాస్తవాలపై అనుమానాలెందుకు?
పుస్తకంలో ఇంకెన్ని అబద్ధాలు ఉన్నాయో చూడాలి
ఫ్యాక్ట్‌చెక్ అవసరమేంటని ప్రశ్న
కాంగ్రెస్ విశ్వసనీయతపై రామచందర్ రావు ఫైర్
అబద్ధాలు, కల్పిత కథనాలే ఆధారమని ఆరోపణ
పెంగ్విన్ ప్రకటనపై రాజకీయ దుమారం

2 లో

## రహ్మత్ బేగ్‌పై ఎంఐఎం వేటు

అర్ధరాత్రి కీలక ఆదేశాలు జారీ
రహ్మత్ బేగ్‌పై చర్యకు కారణమేంటి?
సోషల్ మీడియాలో వీడియోలపై కలకలం
బీఆర్ఎస్ నేత సంచలన ఆరోపణలు
ఎమ్మెల్యే, కార్పొరేటర్‌పైనా ఆరోపణలు
ఆధారాలు ఉన్నాయంటున్న సల్మాన్ ఖాన్

2 లో

## ఆరోపణల వేడి.. మంత్రి ఔట్!




2 లో

నిధుల దుర్వినియోగం ఆరోపణలపై రాజీనామా
సీఎం శివకుమార్‌కు రాజీనామా లేఖ
తనపై ఆరోపణలన్నీ అసత్యమన్న మంత్రి
ప్రభుత్వానికి చెడ్డపేరు రాకూడదనే నిర్ణయం
విచారణలో నిర్దోషిగా తేలుతానన్న నాగేంద్ర
బీజేపీ, జేడీఎస్ నిరసనలతో ఒత్తిడి

## ఏపీలో కూటమి హవా

మూడ్ ఆఫ్ ది నేషన్‌లో కూటమి జోరు
25లో 20 ఎంపీ సీట్లు కూటమికే?
టీడీపీ-జనసేనకు 18-19 సీట్లు!
వైసీపీకి 4-5 సీట్లే?
24 నుంచి 20కి పడిన కూటమి!
ఏపీలో రెండు సర్వేలతో హీట్!



న్యూస్ డెస్క్, 29 ఆగస్టు (తెలుగు గళం): ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయ్యింది. ఓవైపు సంక్షేమ పథకాలు.. మరోవైపు అభివృద్ధి, పెట్టుబడులు తీసుకురావడంపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. అయితే ఈ రెండేళ్ల కూటమి పాలన ఎలా ఉంది.. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే గెలుపు ఎవరిదనే అంశంపై ఇండియా టుడే- సీ ఓటర్ మూడు ఆఫ్ ది నేషన్ సర్వే చేసింది. ఆగస్టు నెలకు సంబంధించిన సర్వే అంచనాలను వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌లో 25 ఎంపీ స్థానాలకు ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే కూటమికి 20 ఎంపీ స్థానాలు వస్తాయని అంచనా వేశారు.

ఈ సర్వే ప్రకారం.. టీడీపీ, జనసేనకు కలిపి 18 నుంచి 19 సీట్లు వస్తాయని.. బీజేపీకి 1 నుంచి 3 సీట్లు వస్తాయని.. వైఎస్సార్‌సీపీకి 4 నుంచి 5 సీట్లు వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. 2026 జనవరిలో ఇండియాటుడే- సీ ఓటర్ మూడు ఆఫ్ ది నేషన్ సర్వేలో కూటమికి 24 ఎంపీ సీట్లు వస్తాయని వెల్లడించిన సంగతి తెలిసిందే.. ఇప్పుడు 4 సీట్లు తగ్గాయి. ఇక 2024 ఎన్నికల్లో మొత్తం 25 స్థానాలకు గాను.. తెలుగు దేశం పార్టీ 16 స్థానాలు.. 3 స్థానాలు.. జనసేన పార్టీ 2 స్థానాలు.. వైఎస్సార్‌సీపీ 4 స్థానాలు గెలుచుకున్న సంగతి తెలిసిందే.

2 లో

## నేపాల్ నుంచి యూపీకి మృతదేహాలు

నేపాల్ వరదల బీభత్సం
భారత్‌కు కొట్టుకొచ్చిన 7 మృతదేహాలు
నదుల్లో తేలుతూ మృతదేహాలు
మహారాజ్‌గంజ్‌లో 4 మృతదేహాలు
కుషినగర్‌లో 3 మృతదేహాలు
వరద ప్రవాహంలో కొట్టుకొచ్చిన వైనం
నేపాల్‌తో కలిసి గుర్తింపు చర్యలు

2 లో



# ఉద్యోగుల ఓటు సర్కార్ లెక్క!


- ఎన్నికల ముందే పీఆర్సీ అమలు
- ఫిట్‌మెంట్‌పై సర్కార్ కీలక కసరత్తు
- ఉద్యోగుల ఓట్లపై సర్కార్ లెక్క
- పీఆర్సీ రిపోర్ట్ రెడీ అయినట్టే
- భారీ ఫిట్‌మెంట్‌పై ఉద్యోగుల ఆశలు
- డీఏల మెర్జ్‌తో పీఆర్సీ ప్రకటన
- రిటైర్డ్ ఉద్యోగులకు భారీ ఊరట
- మూడో పీఆర్సీకి రంగం సిద్ధం

న్యూస్ డెస్క్, 29 ఆగస్టు (తెలుగు గళం): త్వరలో పీఆర్సీని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలిసింది. ముందుగా కమిటీ నుంచి నివేదిక తెప్పించుకుని, సిఫారసులను పరిశీలించిన తర్వాత తుది నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. అయితే ఫిట్‌మెంట్ ఎంత శాతం ఇవ్వాలి? అనే అంశంపై రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను అన్ని కోణాల్లో అధ్యయనం చేసిన తర్వాతే ఓ నిర్ణయానికి ప్రభుత్వం రానున్నది. ఈ మధ్య ఉద్యోగులు తమ డిమాండ్ల సాధన కోసం ప్రత్యక్ష ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. దీనితో ముందుగా పీఆర్సీ నివేదికను తెప్పించుకుని, స్టడీ చేస్తే ఎలా ఉంటుందనే కోణంలో సర్కారు ఆరా తీస్తున్నట్టు సమాచారం.

మిగతాది 2 లో..

## ఉద్యోగాల ఎర.. కోట్ల వసూళ్లు

ఉద్యోగాల పేరుతో కోట్ల దందా!
ఎమ్మెల్యే పీఏపై కేసు నమోదు
నిరుద్యోగులను నమ్మించి మోసం
నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు
ఒక్కొక్కరి నుంచి రూ.30 లక్షల వరకు!
రూ.10 కోట్ల దాకా వసూళ్లు?
కేసు తర్వాత పీఏ పరార్
ప్రత్యేక బృందాలతో గాలింపు



2 లో

న్యూస్ డెస్క్, 29 ఆగస్టు (తెలుగు గళం): ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ కోట్లాది రూపాయల వసూళ్లకు పాల్పడిన భద్రాచలం కాంగ్రెస్ ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు పీఏ కళ్యాణ్ కుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఉద్యోగార్థులను నమ్మించి, నకిలీ అపాయింట్మెంట్ ఆర్డర్లు ఇచ్చి దందాలు నడిపినట్లు అతనిపై ఆరోపణలు వెల్లువెత్తాయి. ఏజెన్సీ పరిధిలో టీచర్ ఉద్యోగాలు, థర్మల్ పవర్ ప్లాంట్లతో పాటు ఐటీసీ పేపర్ బోర్డులో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికిన కళ్యాణ్ కుమార్, ఒక్కో నిరుద్యోగి నుంచి రూ.10 నుంచి రూ.30 లక్షల వరకు అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు సమాచారం.

## గోదావరి పులసకు భారీ డిమాండ్



2 లో

న్యూస్ డెస్క్, 29 ఆగస్టు (తెలుగు గళం): గోదావరి ప్రాంతంలో 'పుస్తెలమ్మి అయినా పులస తినాల్సిందే' అన్న నానుడి ఉంది. దీనిని నిజం చేస్తూ యానాం చేపల మార్కెట్‌లో గోదావరి పులస చేప సరికొత్త రికార్డు ధర కు అమ్ముడైంది.

## మంగ్లీ కేసులో రాజీ..?


కోట్ల ఆఫర్‌ను తిరస్కరించా!
అమెరికా షోలపై అభ్యంతరం
విదేశీ వేదికలపై అవకాశాలొద్దు
మంగ్లీని కాపాడుతున్నదెవరు?
కేంద్ర మంత్రిపై సంచలన ప్రశ్నలు
డ్రైవర్ ఏమయ్యాడు?
పోరాటం ఆగదన్న సుబ్బు



న్యూస్ డెస్క్, 29 ఆగస్టు (తెలుగు గళం): మైక్రో ఫైనాన్స్ కేసు వివాదంలో ప్రముఖ గాయని మంగ్లీపై వచ్చిన ఆరోపణల వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది.మంగ్లీతో తాను రాజీ పడినట్లు వస్తున్న కామెంట్లపై అడ్వకేట్ సుబ్బు స్పందించారు. ఈ మేరకు ఆయన తాజాగా ఒక వీడియోను రిలీజ్ చేశారు. ఈ కేసులో భాగంగా మంగ్లీ మనుషుల నుంచి రూ.కోట్ల ఆఫర్ వచ్చిందని అయినా నేను ఆ ఆఫర్ ను తిరస్కరించానని ఈ విషయం అంతా ప్రజలకు తెలుసంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.

2 లో

## టెట్ 2026 షెడ్యూల్ విడుదల




2 లో

టెట్ అభ్యర్థులకు పరీక్షల షెడ్యూల్ విడుదల
సెప్టెంబర్ 8, 9 తేదీల్లో టెట్ పరీక్షలు
మూడు షిఫ్టుల్లో పరీక్షల నిర్వహణ
ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు
24,983 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు
పేపర్-1, పేపర్-2కు ప్రత్యేక షెడ్యూల్
మీడియంల వారీగా పరీక్షల నిర్వహణ

# నేపాల్ నుంచి యూపీకి మృతదేహాలు



**న్యూస్ డెస్క్, 29 ఆగస్టు (తెలుగు గళం):** నేపాల్‌లో సంభవించిన తీవ్ర ఆకస్మిక వరదల దాటికి కొట్టుకుపోయిన ఏడు మృతదేహాలు ఉత్తరప్రదేశ్‌లోని సరిహద్దు జిల్లాల్లో ప్రత్యక్షమయ్యాయి. నేపాల్‌లోని చిత్వాన్ ప్రాంతానికి సరిహద్దుగా ఉన్న యూపీలోని మహారాజ్ గంజ్, కుషినగర్ జిల్లాల్లోని నదుల్లో నీటిపై తేలుతూ ఇవి కనిపించాయి. మహారాజ్ గంజ్ జిల్లా పరిధిలో నాలుగు, కుషినగర్ జిల్లా పరిధిలోని నదీ తీరాల్లో మూడు మృతదేహాలను స్థానిక అధికారులు వెలికితీశారు. నేపాల్లో కురిసిన భారీ వర్షాలు, ఆకస్మిక వరదల మూలంగానే ఈ మృతదేహాలు ప్రవాహంలో కొట్టుకొచ్చి ఉంటాయని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. టిబెట్ ఉద్భవించే భోటేకోశి నది నేపాల్లోకి ప్రవేశించి త్రిశూలి నది వ్యవస్థలో భాగమవుతుంది. అనంతరం అది దేవఘాట్ వద్ద కాళి గండకీ నదితో కలిసి 'గండకీ'గా రూపాంతరం చెంది భారత్లోకి ప్రవేశించి గంగానదిలో కలుస్తుంది. ఈ నదీ ప్రవాహ మార్గం ద్వారానే మృతదేహాలు భారత భూభాగంలోకి కొట్టుకొచ్చాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఈ మృతదేహాలను గుర్తించేందుకు నేపాల్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ దర్యాప్తు వేగవంతం చేశారు.

# ఉద్యోగాల ఎర.. కోట్ల వసూళ్లు

మొదటి పేజీ తరువాయి

ఈ క్రమంలో దాదాపు రూ.8 నుంచి రూ.10 కోట్లు వసూలు చేసినట్లు తెలుస్తోంది.

తన పీఏ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వ్యవహారం ఏడు నెలల క్రితమే వెలుగులోకి వచ్చినప్పటికీ, ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు అతడిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మోసపోయిన బాధితులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు అధికారికంగా కేసు నమోదు చేశారు. కేసు నమోదు కావడంతో గత మూడు రోజులుగా కళ్యాణ్ కుమార్ పరారీలో ఉన్నాడు. నిందితుడి కోసం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

# మంగ్లీ కేసులో రాజీ..?

మొదటి పేజీ తరువాయి

అమెరికా మంగ్లీకి అవకాశాలు ఇవ్వొద్దు:

న్యాయస్థానాల్లో మంగ్లీపై తాను, తనపై నిరాధారమైన ఆరోపణలతో మంగ్లీ వేసిన కేసులు ఇప్పటికీ కొనసాగుతున్నాయని చెప్పారు. అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మంగ్లీని అమెరికాలోని ఎన్నారై తెలుగు నిర్వాహకులు అంతర్జాతీయ కార్యక్రమాలకు ఎలా ఆహ్వానిస్తారని ఆయన ప్రశ్నించారు. ఈ కేసులో నిజానిజాలు తేలే వరకు ఆమెకు విదేశీ వేదికలపై అవకాశాలు ఇవ్వకూడదన్నారు. ఈ విషయంలో ఇప్పటికే ఫిల్మ్ ఛాంబర్‌లోనూ ఫిర్యాదు చేసినట్లు గుర్తుచేశారు.

మంగ్లీని కాపాడుతున్న ఆ కేంద్ర మంత్రి ఎవరు?

ఈ కేసులో పోలీసులు తమను ఊరు దాటి వెళ్లవద్దని ఆంక్షలు విధిస్తుంటే, నిందితురాలిగా ఉన్న మంగ్లీ దేశం దాటి విదేశాలకు ఎలా వెళ్తోందని సుబ్బు నిలదీశారు. ఆమెను అరెస్ట్ కాకుండా వెనుకుండి కాపాడుతున్న ఆ కేంద్ర మంత్రి ఎవరనేది ప్రజలు సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. అలాగే ఈ కేసులో కీలక సాక్షి అయిన డ్రైవర్ ఏమయ్యాడు? అతడిని మంగ్లీతో లాలూచీ చేయించింది ఎవరు? అని సంచలన ప్రశ్నలు సంధించారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగేది లేదని ఆయన స్పష్టం చేశారు. కాగా తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర సంచలనం సృష్టించిన ఈ కేసు అడ్వకేట్ సుబ్బు తాజా వ్యాఖ్యలతో ఎటువైపు మళ్లుతుందో చూడాలి.

# రహ్మత్ బేగ్‌పై ఎంఐఎం వేటు



**న్యూస్ డెస్క్, 29 ఆగస్టు (తెలుగు గళం):** తెలంగాణ రాజకీయాల్లో సంచలన పరిణామం చోటు చేసుకుంది. ఎంఐఎం ఎమ్మెల్సీ మిర్జా రహ్మత్ బేగ్‌కు బిగ్ షాక్ తగిలింది. అతడిని పార్టీ నుంచి ఎంఐఎం అధిష్టానం బహిష్కరించింది. తక్షణమే ఎమ్మెల్సీ పదవికి సైతం రాజీనామా చేయాలని ఆదేశించింది. వెంటనే శాసనమండలి చైర్మన్?కు తన రాజీనామాను సమర్పించాలని ఆదేశించింది. ఈ మేరకు గత అర్ధరాత్రి 12 గంటలకు ఏఐఎంఐఎం పార్టీ జాయింట్ సెక్రటరీ ఎస్.ఎ. హుస్సేన్ అన్వర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ పరిణామం ఇప్పుడు ఓల్డ్ సిటీలో తీవ్ర చర్చకు దారితీసింది. రహ్మత్ బేగ్‌పై ఇంత కఠిన చర్య ఎందుకు తీసుకున్నారన్నదానిపై మాత్రం పార్టీ అధిష్టానం ఎలాంటి ప్రకటన చేయలేదు.

వీడియోల వ్యవహారమే కారణమా?:

2023లో ఎమ్మెల్సీగా ఎన్నికైన రహ్మత్ బేగ్ పదవీకాలం 2029 మే వరకు ఉన్నప్పటికీ అతడిని పార్టీ నుంచి సస్పెండ్ చేయడం, ఎమ్మెల్సీ పదవికి తక్షణమే రాజీనామా చేయాలంటూ అధిష్టానం కఠిన నిర్ణయం తీసుకోవడం వెనుక రకరకాల కారణాలు వినిపిస్తున్నాయి. మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడుతూ మీర్జా రహ్మత్ బేగ్ పట్టుబడ్డారని ఈ క్రమంలో అత్తాపూర్‌లో కొందరు యువకులు ఆయనను పట్టుకుని కొట్టి, వీడియోలు తీశారనే ఆరోపణలు సోషల్ మీడియాలో జోరుగా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఎంఐఎం అధిష్టానం రెహ్మత్ బేగ్ పై చర్యలు తీసుకుందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కాగా మీర్జా రహ్మత్ బేగ్ విషయం ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీకి ముందే తెలుసని అయినా రహ్మత్ బేగ్‌ను ఉమ్రాకు పంపించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎమ్మెల్యే, కార్పొరేటర్ సైతం ఆరోపణలు:

ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్ వ్యవహారంపై బీఆర్ఎస్ నేత సల్మాన్ ఖాన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రహ్మత్ బేగ్ అకృత్యాల గురించి హైదరాబాద్ సిటీ మొత్తం తెలియాలని అతన్ని ఎంఐఎం పార్టీ నుంచి ఎందుకు బహిష్కరించారో అసదుద్దీన్ ఒవైసీ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్‌తో పాటు ఒక ఎంఐఎం ఎమ్మెల్యే, ఒక కార్పొరేటర్ కూడా ఉన్నారని ఇందుకు సంబంధించిన అన్ని ఆధారాలు తన వద్ద ఉన్నాయని అన్నారు. అసదుద్దీన్ ఒవైసీ హిజాబ్, ఆడవారితో గౌరవం గురించి మాట్లాడుతారు కానీ వాళ్ల నాయకులు ఏమో ఆడవారితో అసభ్యంగా ప్రవర్తిస్తారని ధ్వజమెత్తారు. నా దగ్గర ఉన్న ఆధారాలు అన్నీ అసదుద్దీన్ ఒవైసీ ముందు ఉంచుతాను వాళ్ల అకృత్యాలను అతని నోటితోనే చెప్పాలన్నారు.

# గోదావరి పులసకు భారీ డిమాండ్

మొదటి పేజీ తరువాయి

శనివారం మార్కెట్‌కు మత్స్యకారులు తీసుకొచ్చిన ఓ మగ పులస చేపను దక్కించుకునేందుకు కొనుగోలుదారులు, వ్యాపారులు తీవ్రంగా పోటీపడ్డారు. ఈ క్రమంలో జరిగిన వేలంలో ఆ ఒక్క పులస చేప ఏకంగా రికార్డు స్థాయిలో రూ.24 వేల ధర పలికి అందరినీ ఆశ్చర్యపరిచింది. సాధారణంగా ఆడ పులసల కంటే మగ పులస చేపలు చాలా అరుదుగా దొరకడం, రుచిలోనూ ప్రత్యేకత కలిగి ఉండటంతో ఇంత భారీ మొత్తం పలికినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి.

మరోవైపు అదే మార్కెట్‌కు వచ్చిన మరో సాధారణ పులస చేప కూడా రూ.7,300 ధరకు అమ్ముడైంది. గోదావరి వరద ప్రవాహంలో సముద్రం నుంచి ఎదురీది వచ్చే ఈ పులస చేపలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విపరీతమైన డిమాండ్ ఉంటుంది. వర్షాకాలం వరదల సీజన్‌లో మాత్రమే లభించే ఈ అరుదైన పులసల కోసం భోజనప్రియులు ధర ఎంతైనా చెల్లించేందుకు ఏమాత్రం వెనుకాడరు. ఈ క్రమంలో యానాం మార్కెట్‌లో ఒక్క చేపకే 24 వేలు పలకడం స్థానికంగా, చేపల ప్రియుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# ఆరోపణల వేడి.. మంత్రి ఔట్!

**న్యూస్ డెస్క్, 29 ఆగస్టు (తెలుగు గళం):** రాష్ట్ర రాజకీయాల్లో సంచలన పరిణామం చోటుచేసుకుంది. నిధుల దుర్వినియోగం ఆరోపణలపై కర్ణాటక గిరిజన సంక్షేమశాఖ మంత్రి బి.నాగేంద్ర తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు సమర్పించారు. రాజీనామా సమర్పించిన అనంతరం నాగేంద్ర మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. "నేను ఒక దళిత వర్గానికి చెందిన నేతనైనందుకే నాపై ఇన్ని ఆరోపణలు చేస్తూ నన్ను టార్గెట్ చేస్తున్నారు. నేను ఎలాంటి తప్పు చేయలేదు, నాపై వచ్చిన ఆరోపణలన్నీ అసత్యమైనవి. ప్రభుత్వానికి, పార్టీకి ఎలాంటి చెడుపేరు రాకూడదనే ఉద్దేశంతోనే స్వచ్ఛందంగా పదవి నుంచి తప్పుకుంటున్నాను. ఈ విచారణలో నేను నిర్దోషిగా బయటకు వస్తాననే పూర్తి నమ్మకం నాకు ఉంది అని ఆయన స్పష్టం చేశారు.

మహర్షి వాల్మీకి షెడ్యూల్డ్ తెగల సంక్షేమ అభివృద్ధి సంస్థలోని కోట్లాది రూపాయల నిధులు అక్రమంగా వివిధ ఖాతాలకు మళ్లాయనే ఆరోపణలపై తీవ్ర రాజకీయ దుమారం రేగింది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని ప్రతిపక్ష బీజేపీ, జేడీఎస్ పార్టీలు పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టాయి. ఈ ఒత్తిడిల మధ్యే నాగేంద్ర తన రాజీనామాను సమర్పించారు. ప్రస్తుతం ఈ కేసుపై దర్యాప్తు కొనసాగుతోంది.

# టెట్ 2026 షెడ్యూల్ విడుదల




**న్యూస్ డెస్క్, 29 ఆగస్టు (తెలుగు గళం):** తెలంగాణలో ఇన్ సర్వీస్ టీచర్స్ కోసం నిర్వహించే టెట్ 2026 పరీక్షల షెడ్యూల్ ను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. సెప్టెంబర్ 8,9 తేదీల్లో 3 షిఫ్టుల్లో టెట్ పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపింది. ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకూ, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకూ ఈ పరీక్షలను నిర్వహించనున్నట్లు వెల్లడించింది. సెప్టెంబర్ 8వ తేదీన తెలుగు, ఇంగ్లీష్ మీడియంలలో పేపర్ -1, పేపర్ -2, సెప్టెంబర్ 9న మిగతా మీడియంల పేపర్ -2 పరీక్షలు జరగనున్నాయి. మొత్తం 24,983 మంది అభ్యర్థులు ఇన్ సర్వీస్ టీచర్స్ టెట్ పరీక్షలు రాయనున్నారు. పూర్తి వివరాల కోసం https://schooledu.telangana.gov.in ను విజిట్ చేయాలని సూచించింది.

# సోనియా ఆత్మకథపై బీజేపీ ఫైర్




**న్యూస్ డెస్క్, 29 ఆగస్టు (తెలుగు గళం):** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్ ' పుస్తకానికి భారత్ లో తాము ప్రచురణకర్తలం కాదని పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా చేసిన ప్రకటన దేశ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. ఈ అంశంపై తాజాగా తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు స్పందిస్తు కాంగ్రెస్ పై విమర్శలు గుప్పించారు. స్వయంగా రాసుకున్న ఒక ఆత్మకథే విచారణకు, వాస్తవాల పరిశీలనకు గురికావాల్సి వచ్చిందంటే.. కాంగ్రెస్ నాయకులు చేసే వ్యాఖ్యల్లో విశ్వసనీయత ఎంత ఉందో ప్రజలు అర్థం చేసుకోవాలని ఆ పుస్తకంలో ఎన్ని అబద్ధాలు ఉన్నాయో పాఠకులు కూడా స్వయంగా పరిశీలించుకోవాలని అన్నారు. సోనియా గాంధీ రాసిన ఈ పుస్తకంపై గతంలో భారీ స్థాయిలో ప్రచారం కల్పించారని, అయితే ఇప్పుడు కొన్ని అంశాల్లో వాస్తవాలను పరిశీలించాల్సి (ఫ్యాక్ట్-చెక్) ఉందని ప్రచురణకర్త కోరడం కాంగ్రెస్ నైజానికి అద్దం పడుతోందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అబద్ధాలు, కల్పిత కథనాలపైనే ఆధారపడుతుందనడానికి ఈ పరిణామమే ప్రత్యక్ష నిదర్శనమని రాంచందర్ రావు పేర్కొన్నారు.

# మున్సిపల్ చట్టంలో కీలక మార్పులు!



**న్యూస్ డెస్క్, 29 ఆగస్టు (తెలుగు గళం):** ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ పాలనకు సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ప్రత్యక్ష ఎన్నికలకు సంబంధించిన ఏపీ మున్సిపల్ లా సవరణ చట్టానికి గవర్నర్ ఆమోదం లభించింది. ఈ సవరణలతో స్థానిక సంస్థల పాలనలో పలు మార్పులు చోటుచేసుకోనున్నాయి. సవరించిన చట్టం ప్రకారం మున్సిపల్ కార్పొరేషన్లలో డిప్యూటీ మేయర్ పదవుల సంఖ్యను రెండింటి నుంచి ఒకటికి తగ్గించారు. అలాగే మున్సిపాలిటీల్లో ఉన్న మున్సిపల్ వైస్ చైర్మన్ పదవులను కూడా రెండింటి నుంచి ఒకటికి కుదిస్తూ చేసిన సవరణకు గవర్నర్ ఆమోదం తెలిపారు. గవర్నర్ ఆమోదం పొందిన సవరణ చట్టాన్ని అధికారిక గెజిట్‌లో ప్రచురించేలా న్యాయ శాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేయనున్నారు. గెజిట్‌లో ప్రచురణ అనంతరం ఈ సవరణలకు అధికారికంగా చట్టబద్ధత లభించనుంది.

**కొత్త జిల్లాలతో 28 జెడ్పీల ఏర్పాటు**

మరోవైపు రాష్ట్రంలోని జిల్లా పరిషత్‌ల సంఖ్యకు సంబంధించి కూడా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉన్న 13 జిల్లా పరిషత్‌లకు అదనంగా కొత్త జిల్లాలను చేర్చి మొత్తం 28 జిల్లా పరిషత్‌లు ఏర్పాటు చేసే దిశగా పంచాయతీరాజ్ చట్టానికి సవరణ చేశారు. కొత్త జిల్లాల ఏర్పాటుకు అనుగుణంగా మొత్తం 28 జెడ్పీల ఏర్పాటు కోసం చేసిన పంచాయతీరాజ్ సవరణ చట్టానికి కూడా గవర్నర్ ఆమోదం లభించింది. దీంతో రాష్ట్రంలో కొత్త జిల్లాల ప్రాతిపదికన జిల్లా పరిషత్‌ల పునర్వ్యవస్థీకరణకు మార్గం సుగమమైంది. మున్సిపల్ సంస్థల్లో పదవుల సంఖ్యను కుదించడం, కొత్త జిల్లాల నేపథ్యంలో జెడ్పీలను పునర్వ్యవస్థీకరించడం వంటి కీలక మార్పులకు గవర్నర్ ఆమోదం లభించడంతో రాష్ట్ర స్థానిక సంస్థల వ్యవస్థలో మార్పులు చోటుచేసుకోనున్నాయి.

# ఏపీలో కూటమి హవా

మొదటి పేజీ తరువాయి

ఇటీవల మరో సర్వే కూడా వైరల్ అయ్యింది.. హైదరాబాద్‌కు చెందిన ఐఐటియన్స్ గ్రూప్ అనే సంస్థ ఆగస్టు నెలలో మూడ్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పేరుతో సర్వే చేసినట్లు చర్చ జరిగింది. వైఎస్సార్‌సీపీకి 83 అసెంబ్లీ స్థానాలు, కూటమికి 62 స్థానాలు వస్తాయని.. మిగిలిన సీట్లలో టఫ్ ఫైట్ ఉంటుందని సర్వేలో అంచనా వేశారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి 44 శాతం, చంద్రబాబుకు 32 శాతం, పవన్ కళ్యాణ్ 6 శాతం, నారా లోకేష్ 5 శాతం మద్దతు తెలిపారని పేర్కొన్నారు. ఏపీలో ఈ రెండు సర్వేలపై ప్రస్తుతం చర్చ జరుగుతోంది.

**వాళ్లకు ఎమ్మెల్యే టికెట్లు కూడా ఇవ్వను.. వైసీపీ నేతలకు జగన్ వార్నింగ్**

ఇండియా టుడే మూడు ఆఫ్ ది నేషన్ సర్వే ప్రకారం.. దేశంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ఎన్డీఏకు 45% ఓట్లతో 326 లోక్‌సభ స్థానాలు వస్తాయని తెలిపింది. బీజేపీకి 261 సీట్లు, కూటమిలో పార్టీలకు 65 సీట్లు వస్తాయని తెలిపింది. జనవరిలో చేసిన సర్వేలో ఎన్డీఏకు 352 సీట్లు వస్తాయని అంచనా వేశారు.. అంటే 26 సీట్లు తగ్గాయి. ఇక కాంగ్రెస్ ఇండియా కూటమికి 185 సీట్లు వస్తాయని అంచనా వేశారు.. జనవరిలో సర్వేతో పోలిస్తే 3 సీట్లు పెరిగాయి. ప్రధానమంత్రి అభ్యర్థిగా మోదీకి 49%, రాహుల్ గాంధీకి 27శాతం మంది మద్దతు తెలిపారు. తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ టీవీకే పార్టీకి ప్రస్తుతం పార్లమెంటులో ఒక్క ఎంపీ కూడా లేరు.. అయినా 9శాతంతో మూడో స్థానంలో నిలిచింది. ఇండియాటుడే- సీ ఓటర్ మూడు ఆఫ్ ది నేషన్ సర్వేను జులై 1 నుంచి ఆగస్టు 25 మధ్య నిర్వహించారు.

# ఉద్యోగుల ఓటు.. సర్కార్ లెక్క!

మొదటి పేజీ తరువాయి

**ఆ ఎన్నికల్లోపే పీఆర్సీ అమలు**

డిసెంబర్ లోపు కోర్ ఏరియా పరిధిలోని గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఆ ఎన్నికలు ముగిసిన వెంటనే మార్చిలో రెండు గ్రాడ్యుయేట్ స్థానాలకు (హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్, ఖమ్మం--నల్లగొండ--వరంగల్ నియోజకవర్గాలు) ఎన్నికలు జరగనున్నాయి. అటు మున్సిపల్, ఇటు గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఎంప్లాయిస్ చాలా కీలకం. పీఆర్సీని ప్రకటించకుండా ఎన్నికలకు వెళ్తే క్షేత్ర స్థాయిలో రాజకీయంగా ప్రతికూల పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉంది. అందుకని చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. ఈ లోపు రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన బెనిఫిట్స్‌ను పూర్తి స్థాయిలో క్లియర్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. అందులో భాగంగా వచ్చే నెల నుంచి ప్రతి నెల రూ.1500 కోట్లపైగా క్లియర్ చేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నట్టు తెలిసింది.

**రెడీగా ఉన్న పీఆర్సీ రిపోర్ట్?**

2023 అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లే ముందు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం సరిగ్గా వారం రోజులు ముందు (అక్టోబరు 2, 2023న) రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎన్.శివశంకర్ చైర్మన్, మెంబర్‌గా మరో రిటైర్డ్ ఐఏఎస్ రామయ్యను నియమిస్తూ పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేసింది. అదే సమయంలో 5 శాతం మధ్యంతర భృతిని సైతం ప్రకటించి, అక్టోబరు నెలతోపాటు అమలు చేసింది. ఆ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి వరుసగా రెండేళ్లపాటు ఆర్థిక సమస్యలు చుట్టుముట్టడంతో పీఆర్సీ అంశాన్ని పెండింగ్‌లో పెట్టింది.

అయితే ఈ మధ్య పీఆర్సీ అమలు చేయాలని ఉద్యోగులు, రిటైర్డ్ ఎంప్లాయిస్ నుంచి పెద్ద ఎత్తున డిమాండ్ వస్తుండటంతో కమిటీ సిఫార్సులపై ప్రభుత్వం ఆరా తీస్తున్నట్టు సమాచారం. ఇప్పటికే ఫిట్‌మెంట్ ఎంత మేరకు ఇవ్వాలనే అంశంపై ఉద్యోగులు, పెన్షనర్ల నుంచి అభిప్రాయాలు సేకరించింది. అలాగే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి కూడా సమాచారాన్ని ఆరా తీసి, నివేదికను రెడీ చేసినట్లు తెలుస్తున్నది. ప్రభుత్వం అడిగిన వెంటనే ఇచ్చేందుకు కావాల్సిన కసరత్తు పూర్తి చేసినట్టు సమాచారం.

**భారీ ఫిట్‌మెంట్ కోసం ఆశలు**

రాష్ట్రం ఏర్పడిన తరువాత 2015లో 43% ఫిట్‌మెంట్‌ను అమలు చేశారు. తెలంగాణలో తొలిసారి పీఆర్సీ కమిటీ 7.5% ఫిట్‌మెంట్‌కే సిఫారసు చేసినప్పటికీ నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏకంగా 30% ఫిట్‌మెంట్‌ను ప్రకటించింది. దీనితో రేవంత్ సర్కారు సైతం పెద్ద ఎత్తున ఫిట్‌మెంట్‌ను ఇస్తుండొచ్చని ఆశలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఉన్నారు. కానీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అందుకు సానుకూలంగాలేదని చర్చ అధికార వర్గాల్లో ఉంది. ఎందుకంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి నేపథ్యంలో ఫిట్‌మెంట్ పెద్దగా ఉండకపోవచ్చనే చర్చ అధికార వర్గాల్లో ఉంది.

ఇప్పటికే 5% మధ్యంతర భృతిని అమలు చేస్తున్నారు. పెండింగ్‌లో ఆరు డీఏలు ఉన్నాయి. ఆ డీఏలను అన్నింటినీ ఫిట్‌మెంట్‌లో మెర్జ్ చేసి పీఆర్సీని ప్రకటించే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. అయితే ఉద్యోగులను నిరాశ పరచకుండా వెంటనే మూడవ పీఆర్సీ ఏర్పాటు చేసి, అసెంబ్లీ ఎన్నికల లోపు (2028 డిసెంబరు) నివేదిక ఇచ్చే విధంగా డెడ్‌లైన్ పెట్టాలని ప్రభుత్వం ప్లాన్ చేస్తుందని ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి వెల్లడించారు.

# నేపాల్‌లో అంతకంతకూ పెరుగుతున్న వరద మృతుల సంఖ్య: 579కి చేరిన ప్రాణనష్టం



**న్యూస్ డెస్క్, 29 ఆగస్టు (తెలుగు గళం):** నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరదలు పెను విషాదాన్ని మిగిల్చాయి. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో విరుచుకుపడిన వరదల ధాటికి ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య ఏకంగా 579కి పెరినట్లు నేపాల్ జాతీయ విపత్తు ప్రమాద తగ్గింపు, నిర్వహణ అథారిటీ అధికారికంగా ధ్రువీకరించింది. కొండచరియలు విరిగిపడటం, నదులు ప్రమాదకర స్థాయిలో ఉప్పొంగి నివాసాలను ముంచెత్తడంతో భారీ ఎత్తున ఆస్తి, ప్రాణ నష్టం సంభవించింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో నేపాల్ ఆర్మీ, సాయుధ పోలీసు బలగాలు, స్థానిక రెస్క్యూ బృందాలు ముమ్మరంగా సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి. గల్లంతైన వారి కోసం తీవ్రమైన గాలింపు చర్యలు జరుగుతుండగా, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిరాశ్రయులైన బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తూ తక్షణ ఆహారం, అత్యవసర వైద్య సదుపాయాలు అందించేందుకు యంత్రాంగం నిరంతరం శ్రమిస్తోంది.

# గడువు పెంచండి.. సర్ పై ఈసీకి సీఎం రేవంత్ రెడ్డి లేఖ



**న్యూస్ డెస్క్, 29 ఆగస్టు (తెలుగు గళం):** తెలంగాణలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ గడువును మరో నాలుగు వారాల పాటు పొడిగించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కు లేఖ రాశారు. ప్రస్తుతం నిర్ణయించిన గడువు సెప్టెంబర్ 16తో ముగియనున్న నేపథ్యంలో, ప్రజలకు అలాగే రాజకీయ పార్టీలకు మరింత సమయం కల్పించేందుకు ఈ గడువును పొడిగించాలని ఆయన కోరారు. 73.39 లక్షల ఎంట్రీలు ASDD కేటగిరీలో ఉన్నాయని, తాత్కాలికంగా వెళ్లినవారిని కూడా శాశ్వతంగా తరలివెళ్లినట్లుగా పరిగణించే అవకాశం ఉందని లేఖలో పేర్కొన్నారు. ఓటర్లకు కొత్త అడ్రస్ తో నమోదు చేసుకునేందుకు ఈసీ సహాయం చేయాలని కోరారు. అలాగే నోటీసులపై స్పందించేందుకు ఓటర్లకు సమయం ఇవ్వాలని, లిస్టు నుంచి అర్హులైన ఓటర్లు తొలగిపోకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ERO స్థాయిలో సిబ్బందిని మరింత పెంచాలని కోరారు.

రాష్ట్రంలో సమీప భవిష్యత్తులో ఎలాంటి ఎన్నికలు లేనందున, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను మరింత పక్కాగా పూర్తి చేసేందుకు ఈ సమయం ఎంతో ఉపయోగపడుతుందని లేఖలో పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఈ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా పూర్తి సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళనలను అరెస్టులతో అణచివేస్తారా.. కాంగ్రెస్ సర్కార్‌పై తెలంగాణ జనసేన ధ్వజం

**న్యూస్ డెస్క్, 29 ఆగస్టు (తెలుగు గళం):** న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళనలను కాంగ్రెస్ ప్రభుత్వం అరెస్టులు, పోలీసు లాఠీఛార్జీలతో అణచివేయాలని చూడటం అత్యంత దుర్మార్గమని తెలంగాణ జనసేన పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పరస్పర నిందారోపణలు, రాజకీయ నాటకాలకు తెరలేపాయని ఎక్స్ (ట్విట్టర్) వేదికగా తెలంగాణ జనసేన మండిపడింది. విద్యార్థులను ఇంకెన్నిసార్లు రోడ్లపైకి లాగుతారని, హక్కుల కోసం పోరాడే విద్యార్థులపై ఇంకెన్ని అరెస్టులు చేస్తారు, ఎంతమందిపై లాఠీలు ఝుళిపిస్తారని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించింది. ప్రభుత్వం మొండి వైఖరి వీడి ప్రజల, విద్యార్థుల మనోభావాలను అర్థం చేసుకోవాలని జనసేన హితవు పలికింది. తెలంగాణ యువతకు ప్రస్తుత తరుణంలో కావాల్సింది నిజమైన నైపుణ్యాలు, నాణ్యమైన సాంకేతిక విద్య మరియు భరోసానిచ్చే ఉపాధి అవకాశాలేనని స్పష్టం చేసింది. నియంతృత్వ పోకడలకు స్వస్తి పలికి వెంటనే విద్యార్థుల గోడును వినాలని, విద్యా రంగంలో చేపట్టే సంస్కరణలను వివేకంతో, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించేలా అమలు చేసి సానుకూల ఫలితాలు అందించాలని జనసేన పార్టీ డిమాండ్ చేసింది.

# జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మేజర్ ధ్యాన్ చంద్‌కు ఘన నివాళి

- ఏటూరునాగారం కస్తూర్బా పాఠశాలలో ఘనంగా హాకీ దిగ్గజం జయంతి వేడుకలు
- క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం -- విద్యార్థినులు క్రీడల్లో రాణించాలి



**తెలుగు గళం ఏటూరునాగారం, ములుగు :**

ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో భారత హాకీ దిగ్గజం, ప్రపంచ ప్రఖ్యాత హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతి వేడుకలను జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేలా పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల స్పెషల్ ఆఫీసర్ మడే అరుణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులతో కలిసి మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన దేశానికి అందించిన సేవలు, హాకీ క్రీడలో సాధించిన అపూర్వ విజయాలు, క్రీడల పట్ల ఆయనకున్న అంకితభావం గురించి విద్యార్థినులకు వివరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థుల సంపూర్ణ వికాసంలో క్రీడలు ఎంతో కీలకమైన పాత్ర పోషిస్తాయని తెలిపారు. క్రీడల ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, జట్టు స్ఫూర్తి పెంపొందుతాయని పేర్కొన్నారు. మేజర్ ధ్యాన్ చంద్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థినులు క్రీడల్లో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం విద్యార్థినులు దేశభక్తి గీతాలు ఆలపించడంతో పాటు మేజర్ ధ్యాన్ చంద్ జీవితం, క్రీడా ప్రస్థానం, జాతీయ క్రీడా దినోత్సవ ప్రాధాన్యతపై ప్రసంగాలు చేశారు. కార్యక్రమంలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని క్రీడల పట్ల తమ ఆసక్తిని చాటుకున్నారు. పి.ఈ.టి. స్వరూప మాట్లాడుతూ,"క్రీడలు విద్యార్థినుల్లో శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంచుతాయి. క్రీడల ద్వారా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదల వంటి మంచి లక్షణాలు అలవడతాయి. మేజర్ ధ్యాన్ చంద్ జీవితం యువతకు గొప్ప స్ఫూర్తి. ప్రతి విద్యార్థిని కనీసం ఒక క్రీడలో తప్పనిసరిగా పాల్గొని తమ ప్రతిభను వెలికితీయాలి" అని అన్నారు. స్పెషల్ ఆఫీసర్ మడే అరుణ మాట్లాడుతూ,"మా పాఠశాలలో విద్యతో పాటు క్రీడలకు కూడా అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థినుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. విద్యార్థినులు క్రీడల్లో పాల్గొని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా పాఠశాల తరఫున ప్రోత్సాహం అందిస్తాం" అని తెలిపారు. క్రీడలు కేవలం పోటీలకే పరిమితం కాకుండా విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, ఆరోగ్యకరమైన జీవనశైలికి ఎంతో దోహదపడతాయని కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ప్రతి విద్యార్థిని చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభను కనబరిచి పాఠశాలకు, తల్లిదండ్రులకు, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, పి.ఈ.టి. స్వరూప, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.





# 19 ఏళ్లలో అంచెలంచెలుగా ఎదిగిన తాళ్లూరి"

- ఉత్తమ సేవకు దక్కిన పదోన్నతి"
- ఎలక్ట్రికల్ లైన్ మెన్ నుండి లైన్ ఇన్స్పెక్టర్ గా వెంకటేశ్వరరావు కు పురస్కారం"




**సత్తుపల్లి/ వేంసూరు, ఆగస్టు29 (తెలుగు గళం) న్యూస్:** నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండల కేంద్రం విద్యుత్ శాఖలో లైన్ మెన్ గా పని చేస్తున్న తాళ్లూరి వెంకటేశ్వరరావు ఉత్తమ సేవలకు విద్యుత్ శాఖ గుర్తింపు ఇచ్చింది. లైన్ మెన్ నుండి కందుకూరు లైన్ ఇన్స్పెక్టర్ గా పదోన్నతి లభించింది.అట్టి పదోన్నతి పత్రాన్ని వేంసూరు సెక్షన్ విద్యుత్ అసిస్టెంట్ ఇంజినీర్ గొడ్డటి అంకారావు కు అందజేసి విధులను చేపట్టారు.ఈ సందర్భంగా తన తోటి ఉద్యోగులు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.తాళ్లూరి కుటుంబ నేపథ్యం పై తెలుగుగళం ప్రతినిధి మల్లూరు చంద్రశేఖర్ కొద్దిసేపు వెంకటేశ్వరరావు తో ఫేస్ టు ఫేస్ ముచ్చటించారు.వివరాలలోకి వెళితే తను యవ్వనంలో కుటుంబాన్ని పోషించడానికి సత్తుపల్లి పట్టణంలో ఓ ఐరన్ దుకాణంలో కొన్ని ఏండ్లపాటు గుమస్తాగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ చదువుకున్నానని తెలిపారు.మొదటిగా 2007 లో అసిస్టెంట్ లైన్ మెన్ గా ఉద్యోగం పొంది 2015 లో లైన్ మెన్ గా పదోన్నతి పొందానని తిరిగి 2026 లో లైన్ ఇన్స్పెక్టర్ గా పదోన్నతి పొందానని చాలా ఆనందంగా ఉందన్నారు.తను 19 ఏళ్లలో అంచలంచెలుగా ఎదిగానని ప్రజల నుండి తనపై నేటి వరకు ఎటువంటి పిర్యాదులు లేకుండా,రాకుండా పని చేసిన ప్రతి చోట ప్రజలతో మమేకమై పని చేశానని ఇక మీదట కూడా అలాగే పని చేస్తానని స్పష్టం చేశారు.నేటి యువత మత్తు పానీయాలకు,గుట్కా,మట్కాలకు, పాశ్చాత్య సంస్కృతికి,సైబర్ నేరాలు,దొంగతనాలకు బానిసలుగా మారుతున్న నేపథ్యంలో తాళ్లూరి జీవన పోరాటాన్ని ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలకు వెళ్ళాలని మల్లూరు సూచించారు.

# సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశం

**అభ్యసన సామర్థ్యాల పెంపుపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలి**

**ప్రతి విద్యార్థి సామర్థ్యాన్ని వెలికితీసేలా బోధన సాగించాలి: ఏఎంఓ శ్యాంసుందర్ రెడ్డి**



**తెలుగు గళం వాజేడు, ములుగు :**

వాజేడు నాగారం జడ్పీహెచ్ఎస్‌లో శనివారం వాజేడు, ఏటూరునాగారం, కన్నాయిగూడెం, వెంకటాపురం, మంగపేట మండలాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు సోయం ఆనందరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఏఎంఓ శ్యాంసుందర్ రెడ్డి హాజరై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎల్ఐపీ)ను నిర్దేశిత విధానంలో కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. పీజీఐ సూచికలు ప్రతి ఉపాధ్యాయుడు పూర్తిగా తెలుసుకుని, వాటిని విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా బోధనలో అనుసంధానం చేయాలని తెలిపారు. అలాగే హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను సక్రమంగా ఎలా నింపాలో ప్రతి ఉపాధ్యాయుడు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రాబోయే న్యాస్ పరీక్షల్లో తెలంగాణ రాష్ట్రంతో పాటు ములుగు జిల్లా కూడా మెరుగైన స్థానం సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందని ఏఎంఓ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వాజేడు మండల ఎంఈఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ శక్తికి మించి కృషి చేసి ప్రతి విద్యార్థి సామర్థ్యాన్ని వెలికితీయాలని అన్నారు. విద్యార్థి నిర్దేశిత అభ్యసన సామర్థ్యాన్ని సాధించే వరకు నిరంతరం బోధనా ప్రయత్నాలు కొనసాగించాలని సూచించారు. కాంప్లెక్స్ సమావేశంలో రిసోర్స్ పర్సన్లుగా నునావత్ శ్రీకాంత్, ఎం. నాగేశ్వరరావు పాల్గొని సూచికలు, హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు, టీచింగ్ డైరీలు, పాఠ్య ప్రణాళికలు, వార్షిక ప్రణాళికలు తప్పనిసరిగా నిర్వహించాలని ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ శ్యాంసుందర్ రెడ్డి, ఎంఈఓ వెంకటేశ్వర్లు, జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు సోయం ఆనందరావు, రిసోర్స్ పర్సన్లు నునావత్ శ్రీకాంత్, ఎం.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

# వేంసూరు ఎస్ఐ గా ప్రదీప్"

- ఖమ్మం వి.ఆర్.కు బదిలీ అయిన కవిత"



**సత్తుపల్లి/వేంసూరు, ఆగస్టు29 (తెలుగు గళం) న్యూస్:** సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండల పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా పి.ప్రదీప్ బాధ్యతలు చేపట్టారు.ఇంతకు మునుపు ప్రదీప్ సత్తుపల్లి పట్టణ ఎస్ఐ గా విధులు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రదీప్ మీడియాతో మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలను కాపాడటం ధ్యేయంగా నిరంతరం శ్రమిస్తానని స్పష్టం చేశారు. ప్రజలు, ప్రజా సంఘాల నేతలు సహకరించాలన్నారు. ఇప్పటి వరకు వేంసూరు ఎస్ఐ గా విధులు నిర్వహించిన బి కవిత ఖమ్మం లోని సిపి ఆధ్వర్యంలో వి.ఆర్.( వేకెన్సీ రిజర్వుడు) కు బదిలీ అయ్యారు.మండలంలో శాంతి భద్రతలను కాపాడటం కోసం అందరి సహకారంతో పని చేసిన కవిత కు పలు పార్టీల నేతలు కృతజ్ఞతలు తెలిపారు.

# జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా కొత్తగూడ స్పోర్ట్స్ స్కూల్‌లో పీఓ లెనిన్ వత్సల్ టోప్పో ఐఏఎస్ సందర్శన

- రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులను సిద్ధం చేయాలి
- క్రీడల్లో రాణించి భారత జట్టులో స్థానం సాధించడమే లక్ష్యంగా సాధన చేయాలి -- పీఓ లెనిన్ వత్సల్ టోప్పో




**తెలుగు గళం ఏటూరునాగారం, ములుగు :**

జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐటీడీఏ ఏటూరునాగారం ప్రాజెక్ట్ ఆఫీసర్ లెనిన్ వత్సల్ టోప్పో, ఐఏఎస్ మహబూబాబాద్ జిల్లాలోని కొత్తగూడ బాలుర మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌ను సందర్శించి, విద్యార్థులు మరియు క్రీడా సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయుడు, ఫిజికల్ డైరెక్టర్, పీఈటీలు, కోచ్‌లతో సమావేశమై విద్యార్థుల వయస్సుల వారీగా వార్షిక, నెలవారీ క్రీడా ప్రణాళిక, రోజువారీ సాధన, విద్యార్థుల భాగస్వామ్యం, ప్రత్యేక ఆహారం తదితర అంశాలపై సమీక్షించారు. మార్గదర్శకాల ప్రకారం విద్యార్థులకు పోషకాహారం అందిస్తూ ప్రతిరోజూ క్రమం తప్పకుండా సాధన చేయించాలని ఆదేశించారు. డిసెంబర్‌లో తెలంగాణలో జరగనున్న ఖేలో ఇండియా పోటీలకు విద్యార్థులను సమర్థవంతంగా సిద్ధం చేయాలని పీఓ సూచించారు. అనంతరం రన్నింగ్ ట్రాక్, వాలీబాల్, బాస్కెట్‌బాల్ కోర్టులు, జిమ్ గదిని పరిశీలించి, విద్యార్థులకు ఎలాంటి ఆటంకం లేకుండా మైదానాన్ని చదును చేయడంతో పాటు మైదానం, జిమ్, వసతి గృహం తదితర ప్రాంతాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను అంచనా వేసి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ, రాష్ట్ర స్థాయి విజేతలతో కలిసి కేక్ కట్ చేశారు. అథ్లెటిక్స్‌లో జాతీయ స్థాయిలో పాల్గొన్న విద్యార్థిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ, మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ప్రతిరోజూ క్రమశిక్షణతో సాధన చేసి, అదనపు కృషి చేస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి భారత జట్టులో స్థానం సంపాదించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్/కొత్తగూడ అసిస్టెంట్ గిరిజన అభివృద్ధి అధికారి జి. దేశీరామ్, హెడ్‌మాస్టర్ డి. సరయ్య, ఫిజికల్ డైరెక్టర్, పీఈటీలు, కోచ్‌లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.





# పల్లెల ను సత్కరించిన జర్నలిస్టులు"

- ఫోర్త్ ఎస్టేట్ సహకారంతో ముందుకెళ్తా: ప్రదీప్(పోలీస్ ఎస్సై)



**సత్తుపల్లి/వేంసూరు,ఆగస్టు29(తెలుగు గళం) న్యూస్:** సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండల పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా సత్తుపల్లి పట్టణం నుండి బదిలీపై విధులలో చేరిన పల్లెల ప్రదీప్ ను తెలుగుగళం తెలుగు జాతీయ దినపత్రిక,ఈ 69 కేబుల్ టీవీ, ల నియోజకవర్గ రిపోర్టర్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్,ఉద్యమకెరటం తెలుగు పత్రిక నియోజకవర్గ రిపోర్టర్ పెండెం దుర్గాప్రసాద్ లు శనివారం రాత్రి స్థానిక రక్షక భటుల ఠాణా లో కలసి శాలువా కప్పి సాధారంగా స్వాగతిస్తూ ఘనంగా సత్కరించారు.మండలంలో పరిస్థితులపై జర్నలిస్టులు కాసేపు పల్లెలతో ముచ్చటించారు.అనంతరం పల్లెల మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో,రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చూపిన రాజ్యాంగ అమలులో నాల్గో స్థంభంగా ఉన్న (ఫోర్త్ ఎస్టేట్) జర్నలిస్టుల సహకారంతో మండలంలో శాంతిభద్రతలు నెలకొల్పే దానికి,అవినీతి అక్రమాలు అరికట్టడానికి,నేరాలు ఘోరాలు జరగకుండా ఉండేదానికి ముందుకెళ్తానని,

త్వరలోనే మీడియా ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేస్తానని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్టులతో పాటు సీపీఎం అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం,రజక వృత్తిదారుల సంఘం మండల కార్యదర్శి రాయల చెన్నారావు ఉన్నారు.

# రక్తదానం చెయ్యండి.. ఆరోగ్యాన్ని కాపాడుకోండి..

**రక్తదానం చేస్తే ఇతరులకు జీవితం ప్రసాదించినట్లే. జమ్మలమడుగు అర్బన్ సీఐ నరేష్ బాబు**




**తెలుగు గళం న్యూస్ కడపజిల్లా ఆగస్టు 29:** ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేస్తే వారి ప్రాణాలు కాపాడిన పుణ్యం దక్కుతుందని రక్తదానం ప్రాణదానంతో సమానమని, జమ్మలమడుగు అర్బన్ సీఐ నరేష్ బాబు పేర్కొన్నారు. ఈరోజు కడప జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు జమ్మలమడుగు అర్బన్ పోలీస్ స్టేషన్లో రక్తదాన శిబిరం నిర్వహించారు. అక్టోబర్ 31వ తేదీ సర్దార్ వల్లభాయ్ పటేల్ 151 వ జయంతి పురస్కరించుకొని వివిధ రకాల సేవా కార్యక్రమాలు, విద్యార్థులకు పోటీ పరీక్షలు, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఈరోజు జమ్మలమడుగు అర్బన్ పోలీస్ స్టేషన్లో డిఎస్పి వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు జమ్మలమడుగు పట్టణంలోని ఆరోగ్యవంతులైన యువకులు మరియు పలువురు వ్యక్తుల ద్వారా రక్తదాన శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. కొంతమంది రక్తదానం చేస్తే శరీరం సచ్చు బడుతుందని, వారు తమ శక్తిని కోల్పోతారని అపోహాలో ఉంటారని తెలిపారు. కానీ రక్తదానం ఇవ్వడం వల్ల శరీరంలో ఐరన్ శాతం పెరుగుతుందని మరియు రక్తంలో ఉండే అధిక కొవ్వు శాతం తొలగిపోయి గుండె జబ్బులు రాకుండా, అధిక కొవ్వు రక్తంలో పెరగకుండా రక్తం పలుచబడడం జరుగు తుందని, దీని ద్వారా ఎలాంటి గుండె జబ్బులు రాకుండా ఆరోగ్యవంతులుగా ఉంటారని తెలిపారు. కావున రక్తదానం చేయడం వల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావని గుండెకు సంబంధిత వ్యాధులు రాకుండా జీవితం ఆరోగ్యంగా ఉంటుందని ప్రతి ఒక్కరూ తెలుసు కోవాలని సూచించారు. ఈ మేరకు జమ్మలమడుగు అర్బన్ సీఐ నరేష్ బాబు, ఎస్సై సత్యనారాయణ, పలువురు పోలీసు సిబ్బంది రక్తదానం చేసి రక్తదాన శిబిరం ప్రారంభించారు. అనంతరం దాదాపు 120 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ రక్తదాన శిబిరంలో సేకరించిన రక్తాన్ని ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రికి తరలించి రక్తాన్ని శుభ్రపరిచి అవసరమైన వారికి రక్తాన్ని అందజేస్తామని ప్రొద్దుటూరు రక్త నిల్వ కేంద్రం ఇంచార్జ్ డాక్టర్ శశికళ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు రక్త నిధి నిల్వ కేంద్రం టెక్నీషియన్లు, స్టాఫ్ నర్సులు, సిబ్బంది, జమ్మలమడుగు రక్తనిధి కేంద్రం ఇంచార్జ్ నెల్సన్, జమ్మలమడుగు ప్రభుత్వ వైద్య సిబ్బంది, పోలీస్ సిబ్బంది, పెద్ద ఎత్తున యువకులు తదితరులు పాల్గొన్నారు.

# సస్పెన్స్‌కు చెక్

సంగీత దర్శకుడిగా అద్భుతమైన గుర్తింపును సంపాదించుకున్న దేవిశ్రీ ప్రసాద్ 'ఎల్లమ్మ' చిత్రంతో హీరోగా వెండితెరకు పరిచయం కానున్నారు. బలగం వేణు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో సురభి, ప్రకాష్ రాజ్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. చాలా కాలంగా ఈ సినిమాలో హీరోయిన్ ఎవరు అనే దానిపై పెద్ద ఎత్తున సస్పెన్స్ నెలకొంది. ఎట్టకేలకు ఈ మూవీలో హీరోయిన్ కన్ఫామ్ అయినట్లు తెలుస్తోంది.

ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం.. '8 వసంతాలు' చిత్రంతో మంచి గుర్తింపును సంపాదించుకుని, ప్రస్తుతం 'రోమాంచకం' సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్న అనంతిక సనిల్ కుమార్ ఈ సినిమాలో హీరోయిన్‌గా కన్ఫామ్ అయినట్లు తెలుస్తోంది. తాజాగా దేవిశ్రీ ప్రసాద్, అనంతికపై ఫోటోషూట్ కూడా చేసినట్లు తెలుస్తోంది. ఈ ఫోటోషూట్‌పై మేకర్స్ సంతృప్తి వ్యక్తం చేయడంతో అనంతికను హీరోయిన్‌గా కన్ఫామ్ చేసినట్లు సమాచారం. అన్నీ ఓకే అయితే మరికొన్ని రోజుల్లోనే ఇందుకు సంబంధించిన అధికారిక ప్రకటన కూడా వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.







# 'దే కాల్ మీ ది కింగ్'


టాలీవుడ్ సీనియర్ స్టార్ హీరోల్లో ఒకరైన నాగార్జున ప్రస్తుతం రా కార్తీక్ దర్శకత్వంలో 'కింగ్ 100' చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. ఈ మూవీ షూటింగ్ ప్రారంభమై చాలా కాలం అవుతున్నప్పటికీ చాలాకాలం మేకర్స్ ఎలాంటి అప్‌డేట్‌ను బయటకు రానివ్వలేదు. అయితే, నాగార్జున పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం గ్లింప్స్ వీడియోను విడుదల చేసింది. ఈ వీడియో ప్రారంభంలోనే నాగార్జున వాయిస్ ఓవర్‌తో "మనుషుల్లో రెండు రకాలు. ఒకరు డబ్బున్నోళ్లు, ఇంకొకరు లేనివాళ్లు. డబ్బు లేనప్పుడు నన్ను అందరూ లూజర్‌లా చూశారు. డబ్బు ఉన్నప్పుడు 'దే కాల్ మీ ది కింగ్'. దిస్ ఐడెంటిటీ ఈజ్ మోర్ పవర్‌ఫుల్ థెన్ మనీ. ఆ ఐడెంటిటీని నిలబెట్టుకోవడం కోసం నేను పరిగెడుతూనే ఉండాలి" అంటూ చెప్పే డైలాగ్‌తో గ్లింప్స్ ఆసక్తికరంగా సాగింది.

ఇక ఈ వీడియోలో బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, విజువల్ ఎఫెక్ట్స్‌తో పాటు నాగార్జున లుక్ ప్రేక్షకులను అద్భుతంగా ఆకట్టుకున్నాయి. చివర్లో నాగార్జున ఓ పాపను ఎత్తుకుని కనిపించారు. ఆ పాప ఎవరు? అనే క్యూరియాసిటీ ప్రేక్షకుల్లో పెరిగిపోయింది. ఈ సినిమాను ఈ ఏడాది డిసెంబర్ 24న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. గ్లింప్స్‌ను బట్టి చూస్తే.. ఈ సినిమాలో నాగార్జున పేదవాడి స్థాయి నుంచి డబ్బున్న వ్యక్తిగా ఎలా ఎదిగారు? ఆ మధ్యలో ఎలాంటి పనులు చేశారు? అనే అంశాలతో కథ సాగనున్నట్లు తెలుస్తోంది. గ్లింప్స్ సూపర్‌గా ఉండటంతో ఈ మూవీతో నాగార్జున సాలిడ్ హిట్ కొట్టడం ఖాయమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# 'యెష నాగుల'తో నాని మాస్ జాతర

నేచురల్ స్టార్ నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో సూపర్ హిట్ 'దసరా' తర్వాత వస్తున్న భారీ యాక్షన్ సినిమా 'ది ప్యారడైజ్'. ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ సినిమాకు రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, మొదటి పాట 'ఆయా షేర్' పెద్ద హిట్ కాగా, తాజాగా ఈ మూవీ నుంచి సెకండ్ సింగిల్ 'యెష నాగుల' అని సాగే పాటను విడుదల చేశారు. అమెరికాలోని డల్లాస్‌లో జరిగిన అనిరుధ్ లైవ్ కాన్సర్ట్‌లో వేలాది మంది అభిమానుల మధ్య ఈ పాటను గ్రాండ్‌గా లాంచ్ చేశారు. మన ఊరి జానపద లిరిక్స్‌కు అనిరుధ్ తనదైన శైలిలో అదిరిపోయే మాస్ బీట్స్ జోడించారు. కాసర్ల శ్యామ్ రాసిన లిరిక్స్ పక్కా లోకల్ ఫీల్‌ను తేవడమే కాకుండా, జంగి రెడ్డి, ప్రభల గొంతు పాటకు మంచి ఊపును తెచ్చింది.

ఆట సందీప్ కొరియోగ్రఫీ చేసిన మాస్ స్టెప్పులు విజువల్‌గా చాలా బాగున్నాయి. అయితే ఈ పాటలో నాని వేసిన మాస్ డ్యాన్స్ స్టెప్పులు, ఆయన యాటిట్యూడ్ ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఈ పాటలో మెరిసిన కీర్తి సురేష్ తన గ్లామర్‌తో నానికి పర్ఫెక్ట్ జోడీగా నిలిచారు. తెలంగాణ జానపదానికి మరింత హుషారెత్తించే బీట్ డ్యాన్స్ చేసే ఊపునిస్తోంది. అలాగే ఈ సాంగ్ సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. కేవలం సినిమాలో మాత్రమే కాకుండా ప్రతీ పార్టీలో, పండుగల్లో మార్మోగిపోవడం ఖాయంగా కనిపిస్తోంది. కాగా.. ఈ సినిమాలో మోహన్ బాబు, కాయదు లోహర్, రాఘవ్ జుయల్, సోనాలి కులకర్ణి, సంపూర్ణేష్ బాబు, తనికెళ్ల భరణి కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. ఇక ఈ భారీ చిత్రాన్ని సెప్టెంబర్ 24న తెలుగు, తమిళం, హిందీతో పాటు ఇంగ్లిష్, స్పానిష్‌లతో కలిపి మొత్తం 8 భాషల్లో ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నారు మేకర్స్.




# శాపమా.. మిస్టరీనా?

విభిన్నమైన కథలతో ప్రేక్షకులను అలరించే హీరో సుమంత్, తాజాగా నటించిన స్పిరిచువల్ మిస్టరీ థ్రిల్లర్ మూవీ 'మహేంద్రగిరి వారాహి'. ఈ చిత్రానికి సంతోష్ జాగర్లపూడి దర్శకత్వం వహించారు. రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్, బ్రిడ్జ్ ఫిల్మ్స్ బ్యానర్లపై లక్ష్మణ్, కాళిపు మధు సంయుక్తంగా నిర్మించారు. ఇప్పటికే టీజర్‌తో ఆకట్టుకున్న ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేస్తూ. "వారాహి అమ్మవారి శాపం.. అదో రహస్యం" అనే క్యాప్షన్ జత చేశారు. కాశీ గ్రామ దేవత అయిన వారాహి మాత మహేంద్రగిరిలో ఎలా వెలిసిందో చూపిస్తూ కథలోకి తీసుకెళ్లారు. ఆ ప్రాంతాన్ని ఏలే రాజకుటుంబంలోని సభ్యులు దాదాపు 150 సంవత్సరాలుగా ఒకరి తర్వాత ఒకరు విచిత్రమైన పరిస్థితుల్లో మరణిస్తూ ఉంటారు.




ఈ మరణాల వెనుక వారాహి అమ్మవారి శాపం ఉందని స్థానిక ప్రజలు గట్టిగా నమ్ముతారు. అందరూ దైవాగ్రహానికి భయపడి ఊరుకుంటే, హీరో మాత్రం ఆ శాపాన్ని నమ్మడు. దేవుడి పేరిట జరుగుతున్న ఈ మరణాల వెనుక అసలు నిజం ఏమిటో తెలుసుకోవడానికి దైవశక్తినే ఎదురించే సాహసం చేస్తాడు. నమ్మకానికి, నిజ శోధనకు నడుమ సాగే పోరాటమే ఇందులో చూపించారు. కాగా.. ఈ సినిమాలో సుమంత్ పవర్‌ఫుల్ పెర్ఫార్మెన్స్‌తో మెప్పించగా, వారాహి మాత పాత్రలో ఐశ్వర్య రాజేష్ కనిపించారు. స్టార్ హీరో సిద్ధు జొన్నలగడ్డ ఒక కీలక పాత్రలో సర్‌ప్రైజ్ ఇవ్వడం విశేషం. మిశాక్షి గోస్వామి, మాళవిక నాయర్, బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, రాజీవ్ కనకాల, అలీ కీలక పాత్రలో కనిపించారు. సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.

# ధనుష్ 'ఓమ్'కు బ్రేక్

వరుస హిట్లు కొడుతూ నటుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా తన ప్రత్యేక ముద్ర వేసుకున్న కోలీవుడ్ స్టార్ ధనుష్ నటిస్తున్న తాజా చిత్రం 'ఓమ్'. రీసెంట్‌గా 'అమరన్'తో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న డైరెక్టర్ రాజ్ కుమార్ పెరియసామి ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ బిగ్ ప్రాజెక్ట్‌లో మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి కీలక పాత్ర పోషిస్తుండగా, గ్లామర్ అండ్ పర్ఫార్మెన్స్ క్వీన్స్ సాయి పల్లవి, శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తున్నారు. సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను రైటాక్ స్టూడియోస్, వండర్‌బార్ ఫిలిమ్స్ బ్యానర్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాయి. మొదట ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ సినిమా అక్టోబర్ 16న గ్రాండ్‌గా రిలీజ్ కావాల్సి ఉంది.

కానీ గత కొద్దిరోజులుగా ఈ మూవీ పోస్ట్‌పోన్ అయిందంటూ వార్తలు రావడంతో, తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో దర్శకుడు రాజ్ కుమార్ పెరియసామి ఈ విషయంపై ఓపెన్‌గా మాట్లాడారు. 'ఓమ్' మూవీ రిలీజ్ వాయిదా పడటం నిజమేనని ఆయన తెలిపారు. సినిమా నిర్మాణ పనుల్లో ఆలస్యం కావడం, మెయిన్ యాక్టర్ల కాల్ షీట్స్ అడ్జస్ట్ కాకపోవడం మరియు కొన్ని లొకేషన్ల షూటింగ్ అనుమతులు రావడం లేట్ అవ్వడమే ఈ డీల కి అసలు కారణమని చెప్పారు. అంతేకాకుండా అదే టైమ్‌కి మరికొన్ని పెద్ద సినిమాలు రిలీజ్‌కు క్యూ కట్టడంతో అనుకున్నన్ని థియేటర్లు దొరికే అవకాశం లేకుండా పోయిందని, అందుకే సరైన డేట్ చూసి రిలీజ్ చేయాలని నిర్మాతలు భావించారని ఆయన క్లారిటీ ఇచ్చారు. త్వరలోనే సరికొత్త రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేస్తామన్నారు.




# చైతూ కోసం క్రేజీ కాంబో!

టాలీవుడ్ యువ నటుడు నాగ చైతన్య 'తండేల్' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్నాడు. ప్రస్తుతం 'వృషకర్మ' చిత్రంలో హీరోగా నటిస్తున్నాడు. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఈ సినిమాను ఈ ఏడాది దసరాకు విడుదల చేయనున్నట్లు చిత్ర దర్శకుడు కార్తీక్ దండు చెప్పుకొచ్చాడు. 'వృషకర్మ' తర్వాత నాగ చైతన్య ఎవరితో సినిమా చేస్తారనే దానిపై చాలా రోజులుగా సస్పెన్స్ నెలకొంది. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం.. చైతూ తన తదుపరి సినిమాను 'బెదురులంక 2012' మూవీ దర్శకుడు క్లాక్స్‌తో చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై అల్లు అరవింద్ నిర్మించబోతున్నట్లు సమాచారం. ఈ మూవీ తర్వాత వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నట్లు తెలుస్తోంది. ఇలా 'వృషకర్మ' తర్వాత మరో రెండు సినిమాలను ఇప్పటికే చైతూ లైన్‌లో పెట్టినట్లు వార్తలు వస్తున్నాయి.



Printed and Published by BARISHETTI SRIKANTH on be half Of Telugu galam
H.No: H.NO: 8-2-293/82/BJR/127, BJR NAGAR, FILM NAGAR, GREATER HYDERABAD(M.CORP), PO:JUBILEE HILLS, HYDERABAD, TELANGANA - 500033.
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.